క్లుప్తంగా

నరసింహాస్వామికి మాజీ ఎమ్మెల్యే పూజలు



మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో లక్ష్మీనరసింహాస్వామికి జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర చంద్రశేఖర్ సోమవారం పూజలు చేశారు. అనంతరం మహిళలు ఆయనకు రాఖీలు కట్టారు. అనంతరం గ్రామంలో అభివృద్ధి పనులు, సమస్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా నర్సింహాస్వామి విగ్రహ ప్రతిష్ఠ



నర్వ: మండలంలోని పాతర్చేడ్‌లో సోమవారం మిట్టిమీది నర్సింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారికి పంచామృతాభిషేకం, మహామంగళహారతి, పల్లకీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మక్తల్ కాంగ్రెస్ నాయకులు కె.ప్రశాంత్‌కుమార్‌రెడ్డి స్వామివారిని దర్శించుకోగా ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నర్వ సతీష్‌గౌడ్, మహేష్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, సుదర్శన్‌గౌడ్, నర్సింహ, ఆటో బాబు పాల్గొన్నారు.

యాదవ కమిటీ ఎన్నిక



మద్దూరు: మండలంలోని కొమ్మురులో సోమవారం యాదవ గ్రామ కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిన్న వెంకట్, ఉపాధ్యక్షుడిగా మహిపాల్, కార్యదర్శిగా కేశవులు, సభ్యులుగా వెంకటయ్య, బాలకిష్టయ్య, అనిత, మొగులమ్మలను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు జిల్లా యాదవ సంఘం నాయకురాలు అనుసూయ హాజరయ్యారు. కార్యక్రమానికి సర్పంచ్ కృష్ణయ్య, ఎంపీటీసీ లక్ష్మి, గ్రామస్తులు అంజిలయ్యగౌడ్, వెంకటయ్య, ఖాజన్న, గోపాల్ పాల్గొన్నారు.

రైల్వేలైన్‌కు నిధుల మంజూరుపై హర్షం

కోస్గి: కేంద్ర ప్రభుత్వం నూతనంగా చేపట్టే రైల్వేలైన్ల నిర్మాణంలో భాగంగా కృష్ణా–వికారాబాద్ రైల్వే లైన్‌కు అనుమతులిస్తూ నిధులు కేటాయించడంపై బీజేపీ విజ్ఞానవంతుల వేదిక జిల్లా కన్వీనర్ డాక్టర్ బాల్‌నర్సయ్య ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. కొన్ని దశాబ్దాలుగా ఇక్కడి ప్రజల కలగానే మిగిలిపోయిన కృష్ణా–వికారాబాద్ రైల్వే లైన్‌కు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై ప్రధాని మోదీ, రైల్వే మంత్రి అశ్విన్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

రేపు రామస్వామి జాతర టెంకాయల టెండర్లు

కోస్గి: శ్రావణ మాసం సందర్భంగా ప్రతియేటా నిర్వహించే ముంగిమళ్ల రామస్వామి జాతరకు సంబంధించి టెంకాయలు, ఇతర ఆర్జిత సేవల టికెట్ల విక్రయ టెండర్లను బుధవారం నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్, జాతర నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ముంగిమళ్ల గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో టెండర్లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 11 నుంచి 18వ తేదీ వరకు జాతర ఉంటుందని, టెండర్లలో ఆసక్తి ఉన్న వారు పాల్గొనాలని కోరారు.

బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా దరఖాస్తు

ఊట్కూరు: భారతీయ జనతాపార్టీ కార్యాలయం హైదరాబాద్‌లో సోమవారం మక్తల్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఊట్కూరుకు చెందిన ఎం భాస్కర్ దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఆయన బీజేపీ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు. సోమవారం హైదరాబాద్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎంఎల్‌సీ రాంచందర్‌రావుకు దరఖాస్తు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సుభాష్‌చందర్‌జీ, చరణ్‌రెడ్డి ఉన్నారు.

యంనోనిపల్లిని డీపీఓ ఆకస్మిక తనిఖీ



ధన్వాడ: మండలంలోని యంనోనిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సోమవారం జిల్లా పంచాయతీశాఖ అధికారి మురళి ఆకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను పూర్తిగా పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి మౌనికతో పలు విషయాలను అడిగి తెలుసుకొని సూచలు చేశారు.

రహదారి లేక అవస్థలు

- జీర్ణహళ్లికి పొలాల మధ్యలో నడక
- గుంతలమయంగా మట్టి రోడ్డు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



జీర్ణహళ్లికి వెళ్లే దారిలో ఏర్పడిన గుంతలు

ఊట్కూర్: మండల కేంద్రానికి సమీపంలో ఉన్న గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. పెద్దపోర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని జీర్ణహళ్లి ఆమ్లేట్ గ్రామానికి రహదారి లేదు. జీర్ణహళ్లి రెవెన్యూ శివారులో 600 ఎకరాల సాగు భూమి ఉంది. మండల కేంద్రానికి ఈ గ్రామం 6 కి.మీ.ల దూరంలో ఉంది. ఇక్కడ ప్రధాన పంటలతో పాటు కూరగాయలు పండిస్తూ 30 కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాయి. మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు నిర్మించినా నీటి సరఫరా లేక వృథాగా ఉంది. మినీ వాటర్ ట్యాంకు ద్వారా నీరు సరఫరా అవుతోంది. గ్రామంలో పారిశుధ్యం పనులు చేపట్టకపోవడంతో బోరు దగ్గర, మినీ ట్యాంకు చుట్టూ మురుగు నీరు ప్రవహిస్తోంది.



జీర్ణహళ్లికి పొలాల్లో రోడ్డు ఇలా

గ్రామంలో వీధి దీపాలు లేక రాత్రి సమయంలో చీకటిగా ఉంటోందని ప్రజలు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులు..

గ్రామానికి సరియైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం నుంచి మొగ్దంపూర్ బీటీ రోడ్డు వరకు 2కి.మీ. మట్టి రోడ్డు ఉంది. ఇది సరిగా లేకపోవడంతో గుంతలమయంగా మారింది. రోడ్డుపై ముళ్లపొదలు పెరిగాయి. రెవెన్యూ నక్ష ప్రకారం రోడ్డు గుర్తించకపోవడంతో



మినీ ట్యాంకు చుట్టు ముళ్లపొదలు

ప్రజలు పొలాల మధ్యలో రాకపోకలు కొనసాగిస్తున్నారు. వర్షాకాలం గుంతల్లో నీరుచేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి ఆటోలు సైతం వచ్చే పరిస్థితి లేదు. వివిధ పనుల కోసం ఇతర గ్రామాలకు వెళ్లేవాళ్లు మొగ్దంపూర్ బీటీ రోడ్డు వరకు కాలినడకన వెళ్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో వైద్యసేవలకు ఎద్దుల బండ్లపై వెళ్లాల్సి వస్తోంది.

రెవెన్యూ నక్ష ప్రకారం రోడ్డు వేయాలి..



రెవెన్యూ నక్ష ప్రకారం మా గ్రామానికి రోడ్డు లేదు. దీంతో రైతుల పొలాల మధ్య కాలినడకన వెళ్తున్నాం. అత్యవస పరిస్థితుల్లో ఎడ్లబండిపై వెళ్తున్నాం. పిల్లలు చదువు కోసం బడికి ఇతర గ్రామాలకు వెళ్లడానికి పొలాల మధ్యలో కాలినడకన వెళ్తున్నారు. – బస్సప్ప, జీర్ణహళ్లి

పారిశుద్ధ్య కార్మికుడిని నియమించాలి..



గ్రామంలో పారిశుద్ధ్య లోపం వల్ల మంచి నీటి ట్యాంకు చుట్టు దుర్వాసన వస్తోంది. వీధి దీపాలు లేక రాత్రి వేళలో చీకటిమయంగా ఉంటోంది. మిషన్ భగీరథ ట్యాంకు పనులు పూర్తి కాలేదు. మా గ్రామానికి పారిశుద్ధ్య కార్మికుడిని నియమించాలి. – మహాదేవ్, జీర్ణహళ్లి

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మాగనూర్: పది నెలలుగా మధ్యాహ్న భోజన కార్మికులకు బిల్లులు రాకపోవడంతో వంటల కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని, కొత్త అప్పులు పుట్టడం లేదని సీఐటీయూ జిల్లా కో కన్వీనర్ ఆంజనేయులు అన్నారు.సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ఇన్‌చార్జ్ తహసీల్దార్ అమీర్‌కు వినతిపత్రం సమర్పించారు. వెంటనే ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం అధ్యక్షులు గంగమ్మ, శంకరమ్మ, సారా, ఉమా, మైముద, నర్మద, అనంతమ్మ, రాఘవేంద్ర పాల్గొన్నారు.

మరికల్: మధ్యాహ్న భోజన నిర్వాహకులకు పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలని తహసీల్దార్ సునీతకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో తిరుపతమ్మ, సత్యమ్మ, ఆంజనేయులు, రాధమ్మ, రఘు పాల్గొన్నారు.



ఇన్‌చార్జ్ తహసీల్దార్ అమీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దామరగిద్ద: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడారు. ప్రభుత్వం సకాలంలో బిల్లులు అందించపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ కాళప్పకు వినతి పత్రం సమర్పించారు.

బీఆర్‌ఎస్‌లో అసమ్మతి లేదు



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మక్తల్: మక్తల్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీలో అసమ్మతి లేదని బీఆర్‌ఎస్ మండలం అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే నివాసంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నేతల్లో అసమ్మతి ఉందని మక్తల్‌కు చెందిన కొందరు నాయకులు షాద్‌నగర్ సమీపంలో వారు వ్యక్తిగత సమావేశం ఏర్పాటు చేసుకొని మాట్లాడినట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ నేత దేవరి మల్లప్ప మాత్రమే ఉన్నారన్నారు. ఆయన స్వార్థంకోసం ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తున్నట్లు తెలిపారు. దేవరి మల్లప్పపై అధిష్టానానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. దేవరి మల్లప్పను సస్పెండ్ చేయాలని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. సమావేశంలో మక్తల్ పట్టణ అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, మక్తల్ నియోజకవర్గ అధికార ప్రతినిధి రాంలింగం ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

మాగనూర్: ప్రస్తుతం సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, వాటిపై అప్రమత్తత అవసరమని ఏఎస్‌ఐ మన్నన్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో డయల్ 100 సిబ్బంది ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీకు బంపర్ డ్రా తగిలిందని ఫోన్‌కు ఎస్‌ఎంఎస్ ఇచ్చి, వాటిపై క్లిక్ చేయమని చెప్పగానే వెంటనే అకౌంట్‌లో నుంచి మొత్తం డబ్బులు పోవడం, ఏటీఎం కార్డుల ద్వారా డబ్బులు డ్రా చేస్తామని చెప్పి కార్డులు మార్చి డబ్బులు కొట్టేయడం, యాప్‌ల ద్వారా కోల్పోవడం వంటివి మనం తరచు చూస్తున్నామన్నారు. అటువంటి వాటిపై జాగ్రత్త అవసరమన్నారు. ఎవరైనా అలాంటి వారి బారిన



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ మన్నన్

పడితే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1093కి కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. బాధితులకు 24 గంటలలోపు డబ్బులు తిరిగి ఇప్పిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు మహేష్, నీలయ్య, హోంగార్డు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

మాగనూర్: నారాయణపేట డివిజన్ 16 నేషనల్ చాంపియన్‌షిప్ కరాటే విభాగంలో ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కరాటే పోటీలో ప్రతిభ విద్యానికేతన్ విద్యార్థులు ప్రతిభచాటారు. పాఠశాల కరస్పాండెట్ మధుసూదన్ మాట్లాడుతూ పాఠశాలకు చెందిన వాకిటి శృతి, ప్రజ్వల్, శృతి బంగారు పథకాలు సాధించారని, లావణ్య, పుంజనూర్ వైష్ణవి, వైష్ణవి, మరో ముగ్గురు విద్యార్థులు కాంస్య పథకాలు సాధించినట్లు తెలిపారు. ఈ బహుమతులను మహబూబ్‌నగర్ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం, పలువురు నాయకులు అభినందించారు.

మద్దూరు: 16వ నేషనల్ టోర్నమెంట్ కరాటే స్పోర్ట్స్ టోర్నమెంట్‌లో పట్టణానికి చెందిన విద్యార్థులు కటాస్, కుమిటి విభాగంలో ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల యాజమాన్యం సోమవారం పేర్కొంది. నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌కు తెలంగాణ, ఆంధ్ర, కర్ణాటక, ఒడిస్సా, కేరళ, గోవా, పంజాబ్, గుజరాత్



కరాటేలో గెలుపొందిన విద్యార్థులు

రాష్ట్రాలకు చెందిన 1400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో తమ పాఠశాలకు చెందిన నివేదిత, అర్చన, కేదార్, నిషాంత్, వంశీతేజ, విల్సన్ రాజ్, జయశ్రీ, కిశోర్, సిద్దార్థ్, చైతన్యరెడ్డి, సాత్వికరెడ్డి, అవని, సాయిగీతిక, శృతి, అక్షర, నందిని, మెహవిష్, అభిలాష్, బన్నీ, భానుప్రకాష్, నాగచైతన్య, శ్రీకర్‌రెడ్డి, హరి, కార్తీక్, శివ, రత్నతేజలు గోల్డ్, సిల్వర్, కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. వీరందరిని ఎస్‌ఐ శీనయ్య అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం వెంకట్‌రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఎస్‌ఐ శీనయ్య

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

మాగనూర్: సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలలో వివిధ అంశాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించారు. మాగనూర్ మండలం నేరడగం పాఠశాలలో వెంకటయ్య, శ్రీవాణి, పావని, మాగనూర్ ప్రాథమిక పాఠశాలలో స్వప్న, దీపలను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

అందుబాటులో వేరుశనగ విత్తనాలు



దామరగిద్ద: యాసంగి సాగుకు రైతులకు అవసరమైన వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏఈఓ ప్రదీప్‌గౌడ్, ఆగ్రోస్ రైతు సేవా కేంద్ర–2 నిర్వహకుడు అంజప్ప తెలిపారు. తెలంగాణ స్టేట్ సీడ్ కార్పొరేషన్ ద్వారా సరఫరా చేస్తున్న వేరుశనగ కే6 రకం విత్తనాలు 30 కిలోల బస్తా రూ. 2,865లకు అందిస్తున్నట్లు తెలిపారు. కే6 తోపాటు యాసంగి సాగులో రైతులకు అవసరమైన కదిరి లేపాక్షి–1812 రకం వేరుశనగ 25కిలోల బస్తా రూ. 2,256.25లకు, జేజీ–11/ ఎన్‌బీఈజీ–49/ ఎన్‌బీఈజీ–453 రకం విత్తనాలు 25 కిలోలు రూ. 1750 లకు, మినుములు పీయు–31 రకం 4కిలోలు రూ. 424, పెసర 4కిలోలు రూ.433, జొన్న సీఎస్‌వీ–31 రకం 4కిలోల బస్తా రూ.247లకు సీడ్ కార్పొరేషన్ ద్వారా అందిస్తున్నట్లు తెలపారు.

యోగాలో రాష్ట్ర స్థాయికి ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం రమేష్, ఎంపీటీసీ గోవర్ధన్‌గౌడ్

ధన్వాడ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం రమేష్‌శెట్టి తెలిపారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎంపికలో పాఠశాలకు చెందిన శివకుమార్, ఎల్లేష్, అశోక్, పల్లవి, గౌతమిలు ఎంపికై నట్లు తెలిపారు. విద్యార్థులను ఎంపీటీసీ గోవర్ధన్‌గౌడ్, మాజీ వైస్‌ఎంపీపీ రాంచంద్రయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

‘దళితబంధు’లో పారదర్శకత పాటించాలి

నారాయణపేట: దళితబంధు పథకం లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలని, నిజమైన అర్హులకు పథకం అందించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్షను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు బోయిన్‌పల్లి రాము మాట్లాడుతూ గ్రామాల్లో దళితబంధు పథకానికి నిజమైన దళిత పేదలను ఎంపిక చేయడం లేదన్నారు. ఎమ్మెల్యే అనుచరులను, ఆర్థికంగా ఉన్న వారిని, ఇంతకు ముందు ఎస్సీ కార్పొరేషన్‌లో రుణాలు పొందిన వారిని, వ్యవసాయ భూములున్న వారిని ఎంపిక చేస్తున్నారని తెలిపారు. దీంతో నిజమైన దళిత పేదలు నష్టపో



కలెక్టర్‌ను కలిసిన సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ నాయకులు

తున్నారన్నారు. కార్యక్రమంలో రాంచందర్, దస్తప్ప, కాశప్ప, చిన్నప్ప, బాబు, శ్రీను, మల్లేశ్ పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో వాగ్వాదం



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సింగల్‌విండో సీఈఓ వెంకట్రాములు

ధన్వాడ: బీసీబంధు, గృహలక్ష్మి పథకాల్లో అర్హులు కాకుండా అనర్హులను ఎంపిక చేయడంతో ఎంపీటీసీ సభ్యులు ఉమేష్, గోవర్ధన్‌గౌడ్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ధన్వాడ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పద్మిబాయి అధ్యక్షతన సర్వసభ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు మాట్లాడుతూ బీసీబంధులో కేవలం బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలను మాత్రమే ఎంపిక చేశారని ప్రశ్నిస్తుండగా మధ్యలో వైస్‌ఎంపీపీ రాజేందర్‌రెడ్డి కలుగజేసుకున్నారు. తాము బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు బీసీ బంధు, గృహలక్ష్మి ఇస్తామని వైస్‌ఎంపీపీ అనడంతో కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. ప్రభుత్వం ప్రజల డబ్బు నుంచే పథకాల పేరుతో వారికి అందిస్తుందని, బీఆర్‌ఎస్ పార్టీ తన జేబులో నుంచి ఇవ్వడంలేదని ఎంపీటీసీలు హెచ్చరించారు. ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు పార్టీ కార్యకర్తలకు కాకుండా అర్హులైన వారికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ విమల, వాహీద్, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ సిందుజ, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఏఎన్‌ఎంల సమ్మె తాత్కాలిక వాయిదా

నారాయణపేట: రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖలో ఉన్న 5,200 మంది ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని, వారి సమస్యలను పరిష్కరించాలని ఆగస్టు 16 నుంచి చేపట్టిన సమ్మె ప్రభుత్వ హామీ మేరకు తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండన్న తెలిపారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో జిల్లా డీఎంహెచ్‌ఓ శైలజకు సమ్మె తాత్కాలిక వాయిదా పత్రాన్ని అందించారు. ఏఎన్ఎంలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం డైరెక్టర్ ఆఫ్ హెల్త్ శ్రీనివాసరావు కన్వీనర్ ఐఏఎస్ అధికారులతో కూడిన త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేయడంతో సమ్మె వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సబిత, సరూప, శోభ, సావిత్రమ్మ, మంజుల,



డీఎంఅండ్ హెచ్‌ఓకు సమ్మె వాయిదా పత్రాన్ని అందిస్తున్న రెండో ఏఎన్‌ఎంలు

మహేశ్వరి, రాజేశ్వరి, రామేశ్వరి, వెంకటేశ్వరమ్మ, సుజాత, వరలక్ష్మి, భారతి, అనసూయ, చంద్రకళ, అనురాధ, మణెమ్మ, నర్సమ్మ, లక్ష్మి, శారద, గిరిజ, శశికళ, శివలీల, జ్యోతి పాల్గొన్నారు.

కల్వర్టు పనులు పూర్తి చేయండి



పనులు సగం వరకు చేసిన కల్వర్టు

మక్తల్: పట్టణంలో అంతర్రాష్ట్ర రాహదారి పక్కనున్న కల్వర్టు పనులను వెంటనే పూర్తి చేయాలని యల్లమ్మకుంట, బసవేశ్వర కాలనీ వాసులు కోరుతున్నారు. కల్వర్టుకు గుంత పూర్తి చేయకపోవడంతో రాత్రి సమయంలో కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు నిర్లక్ష్యం వల్ల కొందరు కల్వర్టులో పడిన ఘటనలున్నాయి. కల్వర్టు పనులు వెంటనే పూర్తి చేయాలని కోరుతున్నారు.

పాఠశాలను డీఆర్‌పీల తనిఖీ



కర్ని పాఠశాలను తనిఖీ చేసిన డీఆర్‌పీ శ్రీకాంత్

మక్తల్: మండలంలోని కర్ని ప్రాథమిక పాఠశాలను సోమవారం డీఆర్‌పీలు ఆకస్మిక తనిఖీ చేశారు. వెలుగు కార్యక్రమంలో భాగంగా అభ్యసన మిత్ర కార్యక్రమాన్ని జిల్లా డీఆర్‌పీలు శ్రీకాంత్, రాఘవేందర్ పరిశీలించారు. విద్యార్థులు విద్యా సంవత్సరానికి సంసిద్ధులు కావాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో ఎచ్ఎం శ్రీలత, అశోక్, శ్వేత, రమ, తిరుమల పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం



మెడికల్ సీటు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న అధ్యాపకులు

మక్తల్: పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థి కొండన్ విజయ కుమార్ వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీలో సీటు సాధించాడు. మక్తల్‌కు చెందిన ప్రవీణ్‌కు వరంగల్ ప్రతిమ మెడికల్ కళాశాలలో సీటు సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, భాస్కర్‌గౌడ్, మాదవి, నరేష్ పాల్గొన్నారు.

నీట్‌లో సీటు సాధించిన అక్కాతమ్ముడు



అనూష



ప్రణీత్‌కుమార్‌రెడ్డి

మక్తల్: మండలంలోని గుడిగండ్లకు చెందిన స్వరూపారాణి, వెంకటేశ్వర్‌రెడ్డి దంపతుల కూతురు అనూష, కుమారుడు ప్రణీత్‌కుమార్‌రెడ్డి నీట్‌లో సీటు సాధించారు. అనూషకు డెంటల్ విభాగంలో ఎస్‌వీఎస్ మహబూబ్‌నగర్‌లో, ప్రణీత్‌కుమార్‌రెడ్డికి ఆసిఫాబాద్ మెడికల్ కాలేజీలో సీటు సాధించారు. అక్కాతమ్ముడికి ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంపై గ్రామస్తులు తల్లిదండ్రులను విద్యార్థులను అభినందించారు.